
సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 20 । జూన్ । 2023



జేసీబీలు, ట్రాక్టర్లు సీజ్

మట్టి అక్రమంగా రవాణా చేస్తుండగా కొయ్యలగూడెం మండలం యర్రంపేట సాగునీటి చెరువు నుంచి రెండు జేసీబీలు, పది ట్రాక్టర్ ట్రక్కులను స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸



నెక్లెస్‌బండ్ పటిష్టం

పోలవరం గ్రామానికి వరద ముప్పు తప్పించడానికి నెక్లెస్‌బండ్ పటిష్టం చేసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రూ.3 కోట్లతో ఈ పనులు చేపట్టారు. 8లో ▸



కోళ్ల వ్యర్థాల వాహనాలు సీజ్

పెదపాడు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న రెండు వాహనాల్ని పెదపాడు పోలీసులు సీజ్ చేశారు. తోటగూడెం వద్ద ఒకటి, వసంతవాడ వద్ద మరొకటి అడ్డుకుని సీజ్ చేశారు.

న్యూస్‌రీల్

స్పందన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి



భీమవరం డీఎస్పీ కార్యాలయంలో బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎస్పీ యు.రవిప్రకాష్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో 26 ఫిర్యాదులు అందగా వాటిలో వరకట్న వేధింపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నట్లు ఎస్పీ చెప్పారు. భీమవరం వన్‌టౌన్‌కు చెందిన మహిళ తాను అత్తిలి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి నుంచి డబ్బులు అప్పుగా తీసుకున్నానని అప్పు తీర్చేసినా ఆ వ్యక్తి ఇంటికి వచ్చి వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. తాను కువైట్‌లో పనిచేస్తున్న సమయంలో కోనసీమ జిల్లా కత్తిమడుగుకు వ్యక్తి ఫేస్‌బుక్‌లో పరిచయమయ్యాడని, తనను వివాహం చేసుకుంటానని రూ.5లక్షలు తీసుకుని ఇప్పుడు ముఖం చాటేశాడని అతనిపై చర్యలు తీసుకోవాలని పోడూరుకు చెందిన మహిళ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకున్న ఎస్పీ రవిప్రకాష్ స్పందనలో ఫిర్యాదులపై సత్వరమే చట్ట ప్రకారం విచారణ జరిపి పరిష్కరించాలని ఆదేశించారు.

వర్షాల కోసం జైన్ దేవాలయంలో పూజలు



పెదఅమిరం జైన్ దేవాలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

కాళ్ల: పెదఅమిరం జైన్ దేవాలయంలో వరుణుడి కరుణ కోసం గ్రామస్తులు జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వర్షం కురవాలని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బిందెలతో ఆదినాథ్ భగవాన్‌కు అభిషేకం నిర్వహించారు. సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలను కొట్టి పూజలు నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఏ పని తల పెట్టాలన్న తొలుత ఆదినాథ్ భగవాన్‌కి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రతి ఏటా జూన్ మొదటి వారంలోనే విస్తారంగా వర్షాలు కురిసేవని, ఈ ఏడాది రుతుపవనాల జాడే లేదన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జవ్వాది కిషోర్, మాజీ ఎంపీటీసీ ముదుండి రామకృష్ణంరాజు, మాజీ ఉప సర్పంచ్ నడింపల్లి సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా రామతులసి

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్‌గా ఏలూరు జిల్లాకు చెందిన మొడియం రామతులసిని నియమించారు. కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలకు సంబంధించి జోనల్ ఇన్‌ఛార్జ్‌గా రామతులసి వ్యవహరిస్తారు.

ప్రభుత్వ సేవలే జగనన్న సురక్ష లక్ష్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : ప్రభుత్వ సేవలు పూర్తి సంతృప్తి స్థాయిలో ప్రతి కుటుంబానికి అందించడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం స్పందన సమావేశ మందిరంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, పురపాలక సంఘం కమిషనర్లు, ఎంపీడీవోలతో జాయింటు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది రకాల సేవలు ఉచితంగా అందించడమే జగనన్న సురక్ష ప్రధాన లక్ష్యం అన్నారు. కులం, ఆదాయం, పుట్టిన తేదీ, మరణం, వివాహం, ఈ పాస్ బుక్, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు నందు మొబైల్ నెంబరు నమోదు, కౌలు రైతుకార్డులు తదితర ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తారని చెప్పారు. జూలై 1 నుంచి ప్రతి సచివాలయం పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలిసి తహసీల్దార్, ఎంపీడీఓలతో టీంలుగా ప్రతి కుటుంబాన్ని కలవాలన్నారు. ఈ సమావేశాలకు కలెక్టరు, జిల్లా అధికారులు కూడా హాజరవుతారని చెప్పారు. సమావేశంలో రెవిన్యూ డివిజన్ అధికారి దాసి రాజు, డీఎల్‌డీవో కేసీహెచ్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా డబుల్ లైన్

- నాలుగు జిల్లాల్ని అనుసంధానించే ఎన్‌హెచ్-165కు మోక్షం
- రెండు ప్రాజెక్టులుగా నిర్మాణ పనులు
- 107 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ



ముదినేపల్లి వద్ద ఎన్‌హెచ్ 165 రహదారి నిర్మాణం

ఆకివీడు: నాలుగు జిల్లాల్ని అనుసంధానం చేసే ఎన్‌హెచ్ 165 డెల్టా ప్రాంతానికి కీలకంగా మారింది. పామర్రు-(పీపీ) రాష్ట్ర రహదారిగా ఉన్న ఈ రోడ్డును జాతీయ రహదారుల శాఖ రెండు దశాబ్దాల క్రితం విలీనం చేసుకుంది. అయితే రహదారి విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడింది. తొమ్మిదేళ్ల క్రితం ఈ రోడ్డు అభివృద్ధికి అప్పటి కేంద్ర మంత్రి ఆకివీడులో భూమి పూజ చేశారు. పామర్రు నుంచి దిగమర్రు వరకూ 107 కిలోమీటర్ల మేర రహదారిని నాలుగు లైన్లగా విస్తరించేందుకు రూ.1,275 కోట్లు కేటాయించారు. రహదారి విస్తరణ కోసం సరిహద్దు భూముల సేకరణపై కొంత మంది రైతులు, స్థల యజమానులు కోర్టుకు వెళ్ళడంతో నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి.

90 కల్వర్టుల నిర్మాణం

పామర్రు నుంచి ఆకివీడు ఉప్పుటేరు వరకూ రహదారి విస్తరణ పనుల్ని వేగవంతం చేశారు. నిర్మాణ పనుల్ని రెండు ప్రాజెక్టులుగా విడదీసి, పామర్రు-ఆకివీడు వరకూ రూ.273 కోట్లతో పనుల్ని ప్రారంభించారు. కృష్ణా జిల్లా, ఏలూరు జిల్లాల పరిధిలో 90 కల్వర్టులు, 16 వంతెనలు, 2 మేజర్ బ్రిడ్జిల నిర్మాణం వేగంగా జరుగుతుంది. పలు చోట్ల రహదారి విస్తరణ పనుల్ని చేపట్టారు. గుడివాడ, ఆకివీడు వద్ద ఉప్పుటేరుపై మేజర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

ఉప్పుటేరు నుంచి దిగమర్రుపై కోర్టు వివాదం

ఆకివీడు ఉప్పుటేరు నుంచి దిగమర్రు వరకూ రహదారి విస్తరణ కోసం చేపట్టిన భూసేకరణపై కోర్టు వివాదం ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న రహదారికి రెట్టింపు భూమి సేకరించాల్సి ఉంది. కొన్ని చోట్ల మూడు లైన్లకు అనుకూలంగా జాతీయ రహదారి భూమి ఉంది. మరికొన్ని చోట్ల రెండు లైన్ల రోడ్డే ఉంది. దీంతో ఆకివీడు, ఉండి, భీమవరం, వీరవాసరం, లంకలకోడేరు ప్రాంతాల్లో భూసేకరణకు ఎన్‌హెచ్ అధికారులు చర్యలు చేపట్టారు. భూ యజమానులకు, ఎన్‌హెచ్ అధికారుల మధ్య అంగీకారం కుదరకపోవడంతో ఆయా ప్రాంతాల్లోని యజమానులు కోర్టును ఆశ్రయించారు. ఎన్‌హెచ్ 165 నాలుగులైన్ల రహదారి విస్తరణ పనులు ఈ ప్రాంతంలో చేపట్టడం ద్వారా రహదారి మరింత అభివృద్ధి చెందుతుందని పలువురు పేర్కొంటున్నారు. దిగమర్రు వరకు రహదారి పనులు పూర్తయితే అక్కడ నుంచి తూర్పుగోదావరి జిల్లాకు రహదారి అనుసంధానమవుతుందని పేర్కొంటున్నారు. దీని ద్వారా పశ్చిమ, కృష్ణా డెల్టా ప్రాంతాలు అనుసంధానమయ్యే అవకాశం ఉంది.

దిగమర్రు నుంచి వేగంగా పనులు

కృష్ణా జిల్లా పరిధిలోని ఎన్‌హెచ్-165 రహదారి విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రాజెక్టు పరిధిలో పామర్రు నుంచి ఆకివీడు ఉప్పుటేరు వంతెన వరకూ రూ.273 కోట్లతో పనులు జరుగుతున్నాయి. 90 కల్వర్టుల నిర్మాణం, రెండు మేజర్ వంతెనల నిర్మాణం జరుగుతుంది.

– ఎం.సత్యనారాయణరావు, డీఈ, ఎన్‌హెచ్, కృష్ణా జిల్లా

కోర్టు అనుమతి రావాలి

ఉప్పుటేరు నుంచి దిగమర్రు వరకూ రహదారి విస్తరణ పనులకు కోర్టు అనుమతి ఇవ్వాల్సి ఉంది. పలు చోట్ల రహదారి విస్తరణకు అవసరమయ్యే స్థల సేకరణపై సంబంధిత యజమానులు కోర్టుకు వెళ్లారు. నాలుగు జిల్లాల్ని అనుసంధానం చేసే 165 రహదారి వల్ల ప్రజలకు అనేక ఉపయోగాలున్నాయి.

–శ్రీనివాసరావు, డీఈ, ఎన్‌హెచ్, పశ్చిమ జిల్లా, భీమవరం

బొండాడ డ్రెయిన్‌లో కిక్కిస తొలగించాలని ఆదేశం



పల్లిపాలెంలో కిక్కిస, గుర్రపుడెక్క ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం అర్బన్: బొండాడ డ్రెయిన్ పరీవాహక ప్రాంతంలో 350 ఎకరాల వరి ఆయకట్టుకు గుర్రపు డెక్క, కిక్కిస వల్ల ఆటంకం కలుగుతుందని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని డ్రెయినేజీ, వ్యవసాయ శాఖల అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఇటీవల జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో బొండాడ డ్రెయిన్ పరీవాహకంలో ఉన్న 350 ఎకరాలకు గుర్రపు డెక్క, కిక్కిస వల్ల సాగునీరు అందడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో సోమవారం బొండాడ డ్రెయిన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గుర్రపు డెక్క, కిక్కిస పేరుకుపోవడంతో సాగునీరు దిగువకు వెళ్లడం లేదని ఖరీఫ్ వరినాట్లు ప్రారంభమయ్యే నాటికి తొలగించాలన్నారు. శాశ్వత పరిష్కారానికి అవసరమైన చర్యలకు వ్యవసాయ శాఖ స్థానిక రైతులతో సమావేశం నిర్వహించి పూర్తి స్థాయి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ప్రతిపాదన సిద్ధం చేసి పంపితే అవసరమైన నిధులు మంజూరయ్యేలా ప్రభుత్వంతో సంప్రదింపులు చేస్తామని చెప్పారు.

అర్జీదారులు సంతృప్తి చెందాలి

కలెక్టర్ పి.ప్రశాంతి



స్పందనలో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనకు వచ్చే అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షుణ్నంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. స్పందనలో అందిన అర్జీలు రీఓపెన్ కాకుండా స్పష్టతతో పరిష్కరించాలని ఆదేశించారు. పరిష్కారం చేసేటప్పుడు ఫిర్యాదుదారుడితో మాట్లాడి అతను సంతృప్తి చెందేలా పరిష్కరించాలని అన్నారు. స్పందనలో 178 దరఖాస్తులు వచ్చాయని వాటిని ఆయా శాఖలకు పంపించామని చెప్పారు.

స్పందన అర్జీలలో కొన్ని..

- పంట బోదె, గట్టు ఆక్రమణకు గురైందని లేఅవుట్ల అనుమతులపై సమగ్ర విచారణ చేయించాలని పాలకోడేరు మండలం గొల్లలకోడేరుకు శ్రీనివాస్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- గునుపూడిలో తనకు 1.31 సెంట్ల పంట భూమి ఉందని, దానిని అనుకుని చేపల చెరువులు మురుగునీరు చేరి పంటకు నష్టం కలిగిస్తుందని భీమవరానికి చెందిన మిర్తిపాటి గుణేశ్వరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.
- తనకు ఎకరం భూమి ఉందని పాస్‌బుక్‌లో కేవలం 49 సెంట్లు మాత్రమే నమోదైందని, మిగిలిన భూమి కూడా పాస్‌బుక్‌లో చేర్చాలని పెంటపాడు మండలం అకుతీగపాడుకు చెందిన పోలిశెట్టి సత్యనారాయణ కోరాడు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.కృష్ణ వేణి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ డి.అఖిల, జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



చినఅమిరంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పనిచేస్తున్నామని, ప్రతి గ్రామాన్ని పూర్తి స్థాయిలో ప్రజల అభీష్టం మేరకు అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చినఅమిరంలో రూ.41.30 లక్షలతో నిర్మించిన 2 సీసీ రోడ్లు, ఎల్‌వీఎన్ పురం గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా నియోజకవర్గాన్ని పెద్దఎత్తున అభివృద్ధి చేస్తున్నామన్నారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన వంతెనలకు అప్రోచ్ రోడ్లను నిర్మిస్తామన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా రూ. 21 కోట్లతో వీరవాసరం, భీమవరం మండలాలకు పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నియోజకవర్గంలో 15 వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి సొంతింటి కలను నిజం చేశామన్నారు. ఆక్వా రైతులను విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారని, రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధర కల్పిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకువచ్చి సేవలు అందిస్తున్నామన్నారు. కొంతమంది ఇళ్ల స్థలాలు, పెన్షన్లు కావాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే సమస్యలను అక్కడిక్కడే అధికారులతో మాట్లాడి తగిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, తిరుమాని ఏడుకొండలు, మాజీ సర్పంచ్ గొట్టుముక్కల సత్యనారాయణరాజు, పద్మరాజు, శివరామరాజు, లక్ష్మీపతిరాజు, చిల్లిముంతల శ్రీనివాస్, చాపాని శివగణేష్, బొడ్డుపల్లి రాజు, సుధీర్, ఎం.కోటయ్య, చిగురుపాటి సందీప్, సర్పంచ్ కేతా నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్ విక్రయించిన వ్యక్తి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరులో మహిళపై యాసిడ్ దాడి సంచలనంగా మారింది. ఈ యాసిడ్ దాడిలో మరో ముగ్గురిని ఏలూరు దిశ పోలీసులు అరెస్ట్ చేశారు. మహిళపై యాసిడ్ దాడి కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ 8వ రోడ్డు శివారులో ఉంటున్న యడ్ల ఫ్రాన్సిక (35)పై ఈనెల 13న రాత్రి ఇద్దరు వ్యక్తులు యాసిడ్ దాడికి పాల్పడ్డారు. రాత్రి స్కూటీపై ఇంటికి వెళ్తుండగా ఇంటి సమీపంలో యాసిడ్ దాడి చేశారు. ఈ దాడిలో కీలక నిందితుడు బోడా నాగ సతీష్, బెహర మోహన్, బూడిద ఉషాకిరణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. యాసిడ్‌ను బంగారపు పని అవసరాలకు అంటూ కొనుగోలు చేసి తీసుకువచ్చి నాగసతీష్‌కు అమ్మిన ఏలూరు కత్తేపువీధికి చెందిన షేక్ ఖాజాబాబును ఏలూరు దిశ పోలీసులు అరెస్టు చేశారు. యాసిడ్ విక్రయాలకు అనుమతులు లేకుండా వ్యాపారం చేస్తున్న గడియారపు స్తంభం ప్రాంతానికి చెందిన కిరాణా షాపు వ్యాపారి కోళ్ళ త్రివిక్రమరావు, అతని గుమస్తా విదేలా సత్యనారాయణను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముగ్గురిని సోమవారం మధ్యాహ్నం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం ఖాజాబాబుకు 14రోజులు రిమాండ్ విధించారు. మిగిలిన ఇద్దరికీ స్టేషన్ బెయిల్ ఇచ్చేలా ఆదేశించారు. ఈ కేసుపై ఎస్పీ మేరీ ప్రశాంతి ప్రత్యేక దృష్టి సారించడంతో దర్యాప్తు వేగవంతంగా సాగుతోంది.

కూతురిని కిడ్నాప్ చేశారంటూ అల్లుడిపై ఫిర్యాదు

పెనుమంట్ర: విడాకుల కేసు కోర్టులో ఉండగా భార్యను కిడ్నాప్‌చేసి, పుట్టింటి నుంచి తీసుకుపోయిన సంఘటన నెగ్గిపూడి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నెగ్గిపూడి గ్రామానికి చెందిన చిర్ల శ్రీనివాసరెడ్డి, కనకలక్ష్మి దంపతులు తెలిపిన వివరాల ప్రకారం తమ రెండో కుమార్తె పూజారెడ్డిని అదే గ్రామానికి చెందిన సత్తి శ్రీరామారెడ్డికి ఇచ్చి 2020లో వివాహం చేశారు. మొదట్లో తమ కుమార్తెను అల్లుడు బాగానే చూసుకున్నాడని, బాబు పుట్టిన అనంతరం వేధింపులకు గురిచేస్తూ, కొట్టేవాడని చెప్పారు. 2022లో పెనుమంట్ర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా గృహహింస చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ప్రస్తుతం కేసు కోర్టులో ఉండగా ఈనెల 17న సాయంత్రం 4 గంటలకు అల్లుడు శ్రీరామారెడ్డి ఇంటికి వచ్చి తమను తిట్టడమే కాకుండా ఇంట్లోనే నిర్బంధించి కుమార్తె, మనవడిని బలవంతంగా తీసుకువెళ్లిపోయాడని చెప్పారు. అనంతరం 100కి ఫోన్ చేస్తే పోలీసుల నుంచి స్పందన లేదని, గాయాలతో సోమవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు వెళ్లామన్నారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లమని పోలీసులు చెప్పడంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ విషయమై పెనుమంట్ర ఎస్సై సురేంద్రకుమార్‌ను సాక్షి వివరణ కోరగా తమకు ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, ఆసుపత్రి నుంచి సమాచారం వస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

1998 డీఎస్సీ ఉపాధ్యాయుల

సమస్యలు పరిష్కరించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తాము ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీఎస్సీ 1998 ఉపాధ్యాయులు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 1998 డీఎస్సీ ఉపాధ్యాయులైన తమకు కేటాయించిన పాఠశాలల్లో పని చేస్తుండగా ఇటీవల నిర్వహించిన బదిలీల్లో తమ స్థానాల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించడం వల్ల తమకు ఖాళీ లేక ఇబ్బంది పడుతున్నామని డీఈఓ దృష్టికి తీసుకువెళ్లారు. ఏప్రిల్ నెలకు సంబంధించి తమలో అనేక మందికి ఇప్పటికీ జీతాలు అందలేదని ఆయనకు తెలిపారు. దీనిపై డీఈఓ సానుకూలంగా స్పందిస్తూ 1998 డీఎస్సీ ఉపాధ్యాయులకు పూర్తి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఏప్రిల్ నెల జీతాలు అందని ఉపాధ్యాయులు మండలాల వారీగా తమ కార్యాలయంలో తెలపాలని దానిపై తగిన చర్య తీసుకుంటామని తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీకి సత్కారం



ఏలూరులో జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ ప్రసాదరావు దంపతులను సత్కరిస్తున్న బీసీ సంఘాల నేతలు

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు దంపతులను నగరంలోని బీసీ సంఘాలు ఘనంగా సత్కరించాయి. జెడ్పీ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సోమవారం సాయంత్రం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో ఎంతో అట్టహాసంగా సత్కారం నిర్వహించాయి. వివిధ బీసీ సంఘాల తరపున ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి, వారి సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. తమకు జరిగిన సత్కారానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు లక్కోజు రాజగోపాలాచారి మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్ పదవి బీసీలకు ఇచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బాయి చౌదరి, ఎంపీ కోటగిరి శ్రీధర్ జిల్లాలోని మంత్రులకు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఘంటా ప్రసాదరావు నాయకత్వన జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో పార్టీని గెలిపించుకుంటామని చెప్పారు. రాష్ట్ర బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.విఠల్ కుమార్, కన్వీనర్ పామర్తి యేసు రాజు, బీసీ సంఘం నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, సీహెచ్ శ్రీనివాస్, గుత్తుల బాలా త్రిపుర సుందరి, పువ్వుల ఆంజనేయులు, రవి, కృష్ణ, రాజకుమార్, అప్పిరెడ్డి రంగముత్యాలు, అప్పన బత్తుల శివశ్రీ, కొత్తల శివ, నాగపోయిన శ్రీనివాసరావు, ఈదలాడ నాని, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్జీనియా వేలంలో రికార్డులు

- జంగారెడ్డిగూడెం వేలం కేంద్రంలో కేజీ రూ.266గా నమోదు
- రైతుల్లో వెల్లివిరుస్తున్న ఆనందం



వేలంలో వర్జీనియా బేళ్లు

జంగారెడ్డిగూడెం: వర్జీనియా వేలంలో కొత్త రికార్డులు నమోదయ్యాయి. గత ఏడాది కేజీకి గరిష్ట ధర రూ.245 పలికినప్పుడు రైతులు ఆనందం వెల్లివిరిసింది. ఈ ఏడాది వేలంలో అధిక ధరకు పొగాకు అమ్ముడవడంతో రైతులు సంబరపడుతున్నారు. రోజు రోజుకు గరిష్ట ధర పెరగడంతో ఈ సారి వర్జీనియా కాసులు కురిపిస్తుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సన్న చిన్నకారు రైతులు ప్రస్తుతం పలుకున్న ధరలు తమను కష్టాల నుంచి గట్టెక్కిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన ఉత్పత్తితో... నాణ్యమైన ఉత్పత్తితో రైతులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. వర్జీనియా అధికారుల సూచనలు పాటిస్తూ అవశేషాలు లేని నాణ్యమైన పొగాకును రైతులు పండిస్తున్నారు. పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ అధికారుల ఆదేశాలు పాటిస్తూ పంటను పండించడంతో రికార్డు ధరలు నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా ధరలు లభించడంతో రైతుల మోముల్లో ఆనందం వికసించింది. ఎస్ఎల్ఎస్ ఏరియా పరిధిలోని వర్జీనియా వేలం కేంద్రాల్లో సోమవారం గ్రేడ్-1 పొగాకు కేజీకి రూ. 260కు పైగా ధర లభించింది. జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-2, కొయ్యలగూడెం వేలం కేంద్రంలో రూ. 266, జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1లో 265, గోపాలపురం, దేవరపల్లి వేలం కేంద్రాల్లో రూ.264 ధర లభించింది.

వ్యాపారుల మధ్య పోటీతో మంచి ధర

వేలం కేంద్రాలకు రైతులు తీసుకువస్తున్న సరుకు నాణ్యంగా ఉండటంతో వ్యాపారులు వాటిని కొనేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. గత వారం రోజులుగా చూస్తే ధర పెరుగుతూనే ఉంది. గ్రేడ్-1 పొగాకుకు వ్యాపారులు అధిక ధర వెచ్చిస్తున్నారు. ఈ నెల 15న కేజీ ఒక్కింటికి గ్రేడ్-1 పొగాకు ధర రూ.254 నమోదవగా.. దానిని చెరిపివేస్తూ 16న రూ.258గా నమోదైంది. సోమవారం రూ. 266కి చేరింది. వ్యాపారుల్లో పోటీతో వేలం ప్రక్రియ ఉత్సాహంగా సాగుతోంది. ఈ ఏడాది వేలం ప్రక్రియ చూస్తుంటే సరాసరి ధర రూ.200 పైగా నిలిచే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. అదే జరిగితే తాము ఇన్నాళ్లు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కగలమని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

పీజీ క్యాంపస్‌ను గోదావరి వర్సిటీగా అభివృద్ధికి వినతి



ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం ఇస్తున్న గుంపుల సత్యకృష్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయానికి చెందిన తాడేపల్లిగూడెం పీజీ క్యాంపస్‌ను గోదావరి విశ్వ విద్యాలయంగా అభివృద్ధి చేయాలని బహుజన సేన ఏపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ గుంపుల సత్యకృష్ణ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విజ్ఞాపనపత్రాన్ని సోమవారం మంత్రికి అందజేశారు. సత్యకృష్ణ మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 200కు పైగా డిగ్రీ, పీజీ కళాశాలలు ఉన్నాయని, వివిధ కోర్సులలో 50 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారన్నారు. గోదావరి విశ్వ విద్యాలయాన్ని తీసుకువస్తే విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గోదావరి యూనివర్శిటీని తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

ముమ్మరంగా నెక్లెస్‌బండ్ పటిష్టత పనులు

- రూ.3 కోట్ల వ్యయంతో చురుగ్గా నిర్వహణ
- పోలవరానికి వరద నుంచి రక్షణ చర్యలు



పోలవరం గ్రామానికి వరద నుంచి రక్షణగా నిర్మించిన నెక్లెస్‌బండ్ (మట్టికట్ట)



నెక్లెస్‌బండ్‌ను రాళ్లతో పటిష్ట పరుస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం గ్రామానికి వరద నుంచి రక్షణ కల్పించడానికి నెక్లెస్‌బండ్ పటిష్టం చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నెక్లెస్‌బండ్ (మట్టికట్ట)కు గోదావరి వైపు ప్రాజెక్టు ప్రాంతంలోని బండరాళ్లను తీసుకువచ్చి పటిష్ట పరుస్తున్నారు. 32 మీటర్ల ఎత్తున 4 మీటర్ల వెడల్పున సుమారు రూ.3 కోట్ల నిధులతో ఈ పనులు చేపట్టారు.

టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా పనులు

పోలవరం గ్రామంలో వరదల సమయంలో ప్రతి సంవత్సరం ముంపునకు గురై, నష్టం వాటిల్లడంతో ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తోంది. ఈ పరిస్థితిపై 2006 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దృష్టికి అప్పటి ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లారు. గ్రామానికి వరదల నుంచి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. దీంతో ఆయన గ్రామంలో గోదావరి ఒడ్డున నెక్లెస్‌బండ్ (మట్టికట్ట) నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అఖండ గోదావరి కుడిగట్టుకు సంబంధించిన ధవళేశ్వరం నీటిపారుదల శాఖ అధికారులు పాత పోలవరం నుంచి యడ్లగూడెం వరకు సుమారు 3 కిలోమీటర్ల పొడవునా నెక్లెస్‌బండ్ నిర్మాణానికి 2006లో రూ.3 కోట్లతో పనులు ప్రారంభించారు. అప్పట్లో పనులు చేపట్టిన గుత్తేదారుడు కొంతమేర పనులు చేసి వదిలిలేశాడు. 2014 సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మరో గుత్తేదారుడు వచ్చి అరకొర పనులు చేసి బిల్లుల మార్చుకుని వెళ్లిపోయారు. ప్రాజెక్టు ప్రాంతంలోని మట్టిని లారీల్లో తీసుకువచ్చి గట్టును నిర్మించి ఏ విధమైన పటిష్టత లేకుండానే వదిలిపెట్టారు.

జలవనరుల శాఖకు రక్షణ బాధ్యత

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా గోదావరిపై అడ్డుకట్ట నిర్మాణం చేశారు. స్పిల్‌ఛానల్ మీదుగా వరద ప్రవహించింది. దీంతో నాలుగేళ్లుగా వరద ప్రవాహం దిశ మారింది. పోలవరం గ్రామంలో నిర్మించిన నెక్లెస్‌బండ్‌పై వరద ప్రభావం తీవ్రంగా పడింది. 2019, 2020 సంవత్సరాల్లో వచ్చిన భారీ వరదలకు మట్టికట్ట కోతకు గురైంది. వరద ప్రవాహం ఉధృతంగా ఉండటం మట్టికట్ట అండలు అండలుగా ప్రవాహంలోకి జారిపోయింది. దీంతో 4 మీటర్లు వెడల్పు ఉన్న గట్టు రెండు మీటర్లకు చేరుకుంది. ఒక దశలో గట్టు తెగి గండి పడే పరిస్థితి ఏర్పడుతుందని పోలవరం వాసులు ఆందోళన చెందారు. 2019 భారీ వరదల సమయంలో పాత పోలవరంలో గండి పడే పరిస్థితి ఏర్పడింది. ఎన్నో వరదలు చూసినా భయపడని పోలవరంవాసులు మొదటిసారిగా భయాందోళనలకు గురయ్యారు. అప్పటికప్పుడు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన జలవనరుల శాఖాధికారులకు గట్టు రక్షణ బాధ్యతను అప్పగించారు. యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టు ప్రాంతంలో వరద ప్రవహిస్తున్నప్పటికీ నెక్లెస్ బండ్ గోదావరి వైపు కొంత మేర గట్టుకు రక్షణగా బండరాళ్లను లారీల్లో తరలించి పనులు చేశారు. అప్పటి నుంచి గట్టు రక్షణ బాధ్యతలను జలవనరుల శాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారు. 2020 సంవత్సరంలో కూడా భారీ వరదలు రావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు పోలవరంలో మకాం వేసి పనులను పర్యవేక్షించారు. వరదలు తగ్గిన తరువాత కేంద్ర బృందం వచ్చి నెక్లెస్‌బండ్ పరిస్థితిని పరిశీలించింది. గత ఏడాది సీడబ్ల్యూసీ కార్యాలయం సమీపంలో నెక్లెస్ అండ్ అండలు అండలుగా జారిపోయింది. యడ్లగూడెం వద్ద బండ్ అడుగు భాగం నుంచి నీరు గ్రామం వైపు చేరడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. అధికార యంత్రాంగం హుటాహుటిన తరలివచ్చి ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేయించింది. అప్పట్లో ప్రకృతి వైపరీత్యాల నిధులు సుమారు రూ.50 లక్షలతో పోలవరం నుంచి గూటాల వరకు అఖండ గోదావరి కుడిగట్టు పొడవునా కర్రలు, తడికలు పెట్టి ఇసుక బస్తాలు వేసే పనులు చేశారు. వరద ప్రమాదస్థాయికి చేరిన తరువాత హడావుడిగా పనులు చేపడుతున్నారు తప్ప ముందుగా పనులు చేపట్టడం లేదని పోలవరం వాసులు పేర్కొంటున్నారు. నెక్లెస్‌బండ్ పటిష్ట పనులు చేపట్టకపోతే ఎప్పటికైనా పోలవరం గ్రామానికి ముంపు ముప్పు పొంచి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లిన ఎమ్మెల్యే బాలరాజు

పోలవరం ప్రాజెక్టు దిగువన ఉన్న పోలవరం గ్రామానికి వరద నుంచి రక్షణగా నిర్మించిన నెక్లెస్‌బండ్‌ను పటిష్టం చేసే పనులను చేపట్టాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జిల్లా స్థాయి అధికారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. సీఎం ప్రాజెక్టును సందర్శించేందుకు వచ్చిన సమయంలో సమస్యను వివరించారు. నెక్లెస్‌బండ్ పటిష్ట పరచకపోతే గ్రామానికి వరద ప్రమాదం పొంచి ఉన్న పరిస్థితులను తెలియజేశారు. నిర్మించిన నెక్లెస్‌బండ్ (మట్టికట్ట) భారీ వరదల సమయంలో ప్రవాహ ఉధృతికి అండలు అండలుగా జారిపోయిందని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శాశ్వత పరిష్కారంగా పటిష్ట పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు జలవనరుల శాఖాధికారుల పర్యవేక్షణలో మేఘ ఇంజనీరింగ్ సంస్థ నెక్లెస్‌బండ్ పటిష్ట పరిచే పనులు చేపట్టింది. గోదావరి నదివైపు రాళ్లను నింపి, రివిట్‌మెంట్ విధానంతో పనులు చేపట్టారు. ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది వరదలు వచ్చినా పోలవరం గ్రామానికి ఎటువంటి ఇబ్బంది తలెత్తే పరిస్థితి ఉండదని అధికార యంత్రాంగం చెబుతోంది.

నది వైపు రివిట్‌మెంట్ చేయిస్తున్నాం



రూ.3 కోట్ల నిధులతో నెక్లెస్ బండ్ (మట్టికట్ట) పటిష్టం చేసే పనులు చేపట్టాం. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మేఘ ఇంజనీరింగ్ సంస్థ ఈ పనులు చేస్తోంది. పాతపోలవరం నుంచి కమ్మరగూడెం వరకు నది వైపు రాయితో రివిట్‌మెంట్ విధానంలో పనులు జరుగుతున్నాయి. మట్టికట్ట కూడా మరో అరమీటరు ఎత్తున మట్టి వేసి స్లోప్ కూడా ఏర్పాటు చేస్తాం.

– పి.వెంకటరమణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్–1, పోలవరం ప్రాజెక్టు

పవన్.. రాజకీయాలకు అనర్హుడు

- నవ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఊదరగొండి చంద్రమౌళి
- పాలగూడెంలో విలేకరుల సమావేశంలో విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న నవ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఊదరగొండి చంద్రమౌళి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కులాల మధ్య అగాధం సృష్టిస్తూ, హింసను ప్రోత్సహిస్తూ, యువతను రెచ్చకొట్టే వ్యాఖ్యలు చేస్తున్న పవన్ కల్యాణ్.. రాజకీయాలకు, పార్టీ అధ్యక్ష స్థానానికి అనర్హుడని నవ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షులు ఊదరగొండి చంద్రమౌళి అన్నారు. సోమవారం ఏలూరు మండలంలోని పాలగూడెం గ్రామంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ గుర్తు అయిన గాజు గ్లాసును కూడా దక్కించుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వనంటూ చంద్రబాబుకు జనసేనను ధారాదత్తం చేయాలనుకోవడం, చంద్రబాబును సీఎం చేయడం కోసమే అతని ఎత్తుగడలు ఉన్నాయంటూ ధ్వజమెత్తారు. గత 14 ఏళ్లలో ఐక్యంగా ఉంటూ, అన్ని రంగాలలో కలిసి ఉంటూ, వివాహాలు కూడా చేసుకుంటూ ఒక కుటుంబ సభ్యుల్లా ఉన్న దళితులను మాల, మాదిగలుగా విడదీసి ఓట్లు సాధించుకోవడం మినహా చంద్రబాబు చేసింది ఏమిటని ప్రశ్నించారు. తనకు ప్రాణహాని ఉందని, సుపారీ గ్యాంగులు వచ్చాయని పవన్ కల్యాణ్ చౌకబారు మాటలు, యువతను రెచ్చగొట్టే మాటలు, సానుభూతి కోసం వేసే ట్రిక్కులు ఎవరికీ తెలియనివి కావన్నారు. ఒకవేళ నిజంగా ప్రాణహాని ఉంటే, ఆధారాలతో సహా డీజీపీని కలిసి అందజేయవచ్చు కదా అని సూచించారు. నిజంగా నీకు ప్రాణహాని ఉంటే అది చంద్రబాబుతోనే ఉంటుందని, రాజకీయంగా నిన్ను వాడుకుని, నిన్ను ఓడించి, అసెంబ్లీకి రాకుండా చేసేది చంద్రబాబేనని, సొంత మామనే వెన్నుపోటు పొడిచి చంపిన చంద్రబాబుకు మీరు ఒక లెక్కా అనే విషయాన్ని గ్రహించాలని హితవు పలికారు. ఈరోజు నీ పార్టీ వెనుక నీ సామాజిక వర్గంలో కొంతమంది మాత్రమే నీ వెనుక ఉన్నారని, నీ ప్రవర్తన వలన ఎంతో మంది మేధావులు నిన్ను భరించలేక బయటకు వెళ్లిపోయారన్నారు. ముఖ్యంగా మీ సామాజిక వర్గం దైవంగా భావించే వంగవీటి రంగాను చంపించిన తెలుగుదేశం పార్టీతో కలసి పనిచేయడాన్ని నీ సామాజికవర్గం జీర్ణించుకోలేక పోతోందన్నారు. పేద వర్గాలకు ఉచితంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే వద్దనే నీకు.. అధికారం కట్టబెడితే రాష్ట్రంలో పేదలను బతకనివ్వవేమో అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. నీవు ఇదే విధంగా రోడ్ల మీద రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తూ ఉంటే బహుజనులు నిన్ను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల్ని పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటున్నారని, పేదవాళ్లకు ఉండడానికి ఇళ్లు, కట్టుకోవడానికి బట్టలు, తినడానికి ఆహారం, విద్యార్థులకు విద్య నందించడం, వ్యాధిగ్రస్తులకు వైద్యం అందించడం, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం, ప్రజలవద్దకు పాలన, సుపరిపాలన అందించడం, రూ.2.16 లక్షల కోట్లు నేరుగా వాళ్ల బ్యాంక్ అకౌంట్లలో వేయడం వల్ల ఏ అవినీతి లేకుండా పేదరిక నిర్మూలన జరుగుతోందన్నారు. జనసేన, తెలుగుదేశం, బీజేపీ కలిసి పోటీ చేసినా, పరోక్షంగా కాంగ్రెస్, కమ్యూనిస్టులు కూడా నీకు మద్దతు ఇచ్చినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రకులాల్లోని పేదలు సీఎం జగన్ వెంటే ఉన్నారని, 2024 ఎన్నికల్లో అది చూస్తారని, మళ్లీ సీఎంగా జగనే గెలుస్తారని చంద్రమౌళి స్పష్టం చేశారు.

గడపగడపకు సంక్షేమం



పెంటపాడు : బోడపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

రెండు జేసీబీలు, పది ట్రాక్టర్ల సీజ్



కొయ్యలగూడెం పోలీస్ స్టేషన్లో సీజ్ చేయబడిన జేసీబీలు, ట్రాక్టర్లు

కొయ్యలగూడెం: మట్టి అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాలను సోమవారం ఎస్సై జీజే విష్ణువర్ధన్ స్టేషన్‌కి తరలించి సీజ్ చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 18వ తేదీ రాత్రి యర్రంపేట సమీపంలోని సాగునీటి చెరువు నుంచి రెండు జేసీబీలు, పది ట్రాక్టర్ల ట్రక్కుల ద్వారా నిబంధనలకు విరుద్ధంగా మట్టిని రవాణా చేస్తుండడంతో ఆకస్మిక దాడులు చేశామన్నారు. వాహనదారులపై కేసు నమోదు చేసి వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.


జిల్లా జైలులో ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు



ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్యశాఖ అధికారులు

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలోని జైళ్లలోని ఖైదీల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఇస్తూ (ఇంటిగ్రేటెడ్ ఎస్టీఐ, హెచ్ఐవీ, టీబీ, హెపటైటిస్ బీ, హెపటైటిస్ సీ) స్పెషల్ డ్రైవ్ జిల్లాలో ప్రారంభించామని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణ అధికారి డాక్టర్ జీ.రత్నకుమారి చెప్పారు. ఏలూరు జిల్లా కేంద్ర కారాగారంలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఇస్తూ ప్రత్యేక క్యాంపెయిన్ ప్రారంభించారు. జిల్లా జైలులోని ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ ఎస్టీఐ, హెచ్ఐవీ, టీబీ, హెపటైటిస్ బీ, సీ వంటి ఐదు రకాల పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈ వ్యాధులు కారణంగా శారీరకంగా వచ్చే దుష్పరిణామాలను వివరించారు. వ్యాధులను నివారణకు ముందుగా పరీక్షలు చేసి వ్యాధులు ఏమైనా సోకితే వాటికి చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జైలర్ శ్రీనివాసరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి డీపీఎం డాక్టర్ శ్యాంసన్, డీఐఎస్ హరినాథ్‌కుమార్, షేర్ ఇండియా పీవో గంధం జగదీష్, ఏఆర్టీ డాక్టర్ బ్యూలా, సాతి పీపీఎం కే.వినోదకుమార్, మొబైల్ ఐసీటీసీ సిబ్బంది, డీఎస్ఆర్‌సీ సిబ్బంది, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్ దుకాణం గోడౌన్‌లో అగ్ని ప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): టూ టౌన్‌లోని చిన్నవంతెన వద్ద ఎం.నాగ సుబ్రహ్మణ్యంకు చెందిన బాల కార్తికేయ స్టీల్ దుకాణం గోడౌన్‌లో సోమవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. విషయం తెలుసుకున్న ఫైర్ ఆఫీసర్ జీవీ రామారావు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.40 లక్షల ఆస్తినష్టం సంభవించిందని, రూ.20 లక్షల విలువైన స్టీల్ సామాన్లను కాపాడినట్లు ఫైర్ అధికారి చెప్పారు.

రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలు

ఉండి: పాములపర్రులో ఆదివారం రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఐదురుగురికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. భీమవరం నుంచి చినతిరుపతి వెళుతున్న కారు.. గణపవరం నుంచి ఉండి వైపుగా వస్తున్న మరో కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చినతిరుపతి వెళుతున్న కారులో భీమవరానికి చెందిన చింతా సాములమ్మ, ధర్మేంద్ర, సత్యవతి, ప్రసాద్‌తో పాటుగా గణపవరం నుంచి వస్తున్న కారు డ్రైవర్ సత్యనారాయణ గాయపడ్డారు. వీరు భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో మహిళ మృతదేహం లభ్యం





నాగలక్ష్మి (ఫైల్) , కాలువలో లభ్యమైన పెరవలి నాగలక్ష్మి మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణం జువ్వలపాలెం కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో గోదావరి ఏలూరు కాలువలో సోమవారం గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించారు. స్థానికుల సమాచారం మేరకు పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాసుపత్రి మార్చ్యూరీకి తరలించారు. అనంతరం ఈమెను తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామానికి చెందిన పెరవలి నాగలక్ష్మి (35)గా గుర్తించినట్లు రూరల్ ఎస్సై వీరభద్రరావు చెప్పారు. మూడురోజుల క్రితమే బాధితుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. మృతురాలికి భర్త శ్రీను, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారన్నారు. ఇదిలా ఉంటే, తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన కొంతమంది నీలాద్రిపురం గ్రామానికి ఈ నెల 17న వెళ్లి పెరవలి నాగలక్ష్మి అనే మహిళ తమ వద్ద డబ్బులు తీసుకుని తిరిగి చెల్లించకుండా ఇబ్బంది పెడుతోందని తనతో చెప్పారని సర్పంచ్ లక్ష్మణరావు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం వారు నాగలక్ష్మి ఇంటికి వెళ్లి ఆమెను కొట్టడంతో మనస్తాపంతో కాలువలో పడి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని సర్పంచ్ తెలిపారు. ఆయన వెంట దిశా చట్టం రాష్ట్ర కోశాధికారి కొల్లా విజయలక్ష్మి కుమారి, ముద్రగడ లలితకుమారి, రాధ, దిశా సభ్యులు ఉన్నారు. భర్త శ్రీను ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై వీఎస్.వీరభద్రరావు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో అర్చకుడి దుర్మరణం

- కొమిరేపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి
- వాటి కళేబరాలను ఢీకొన్న ప్రమాదాల్లో మరో నలుగురికి గాయాలు



శ్రీనివాసాచారి మృతదేహం

దెందులూరు: కొమిరేపల్లి సమీపంలో హైవే ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి చెందగా, వాటి కళేబరాలను వేర్వేరు వాహనాలు ఢీకొన్న ఘటనల్లో ఓ అర్చకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో రెండు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమలకు చెందిన పురోహితుడు సాతులూరి శ్రీనివాసాచార్యులు (40) శ్రీవారి కొండపైన భక్తుల వాహనాలకు పూజలు చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఇతనికి భార్య శ్రీదేవి, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఆదివారం శ్రీనివాసాచార్యులు, భార్య శ్రీదేవి, అత వరుసకు సోదరుడైన సిరిపురపు కందాళ కృష్ణమాచార్యులు చెరో బైక్‌పై ఏలూరు శివారు శనివారపుపేటలోని ఎగ్జిబిషన్ చూసి తిరిగి వెళుతున్నారు. కొమిరేపల్లి వద్దకు వచ్చేసరికి అప్పటికే గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి చెందగా, హైవేపై పడి ఉన్న వాటి కళేబరాలను వీరి వాహనాలు ఢీకొన్నాయి. దీంతో రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలపాలైన శ్రీనివాసాచార్యులు అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీదేవి, కృష్ణమాచార్యులు గాయాలపాలయ్యారు. కొవ్వలికి చెందిన వేగుంట సాయి అనే వ్యక్తి భీమవరం నుంచి కొవ్వలి వెళుతుండగా ఇదే చోట గేదెలను ఢీకొనడంతో గాయాలయ్యాయి.అలాగే ద్వారకాతిరుమలకు చెందిన శిరిపురపు కందుల చినవెంకన్నకు గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్షతగాత్రులను ఏలూరు తరలించారు. దెందులూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్వారకాతిరుమలలో విషాదఛాయలు

ద్వారకాతిరుమల: కొమిరేపల్లి వద్ద ప్రమాదంలో ద్వారకాతిరుమలకు చెందిన పురోహితుడు సాతులూరి శ్రీనివాసాచార్యులు(40) మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అందరితో కలసిమెలసి ఉండే శ్రీనివాసాచార్యులు అకస్మాత్తుగా మృతి చెందడం స్థానికులను కలచివేసింది. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

వడాలి ఆలయానికి రూ.15 లక్షల విరాళం



వదలిలో విరాళం అందిస్తున్న దాత నాగమణి

పెనుగొండ: వదలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయంలో భోజన శాల, వసతి గదుల నిర్మాణానికి గ్రామానికి చెందిన దాత వెలిచేటి నాగమణి రూ.30 లక్షల విరాళం ప్రకటించి తొలివిడతగా రూ.15 లక్షల చెక్కును అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం రూ.15లక్షల చెక్కును అందించి, మిగిలిన మొత్తాన్ని నిర్మాణ సమయంలో అందించనున్నట్లు దాత వెలిచేటి నాగమణి తెలిపారు. దాతను, దాత కుటుంబ సభ్యులను కమిటీ సభ్యులు అభినందించారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు వెండి విరాళాలు



ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారికి వెండి చీర నిమిత్తం విరాళం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మ వారి చీరకు పలువురు దాతలు వెండిని విరాళంగా అందజేశారు. ఉంగుటూరు మండలం ఉప్పాకపాడు గ్రామానికి చెందిన కామిశెట్టి వీరవెంకట రవికుమార్ –లీలా పార్వతి దంపతులు రూ.10,116లు, కొఠారు లక్ష్మి (ఏలూరు) రూ.10వేలు, ఆలూరి సుమలత (తుళ్లూరు) రూ.5,116లు విలువైన వెండిని వస్తు రూపంలో సమర్పించారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అర్చకులు వేదాశీస్సులు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.హరేరాం ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పట్టణంలో ఉచిత గుండె వైద్య శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం ఈ నెల 20న మంగళవారం టూ టౌన్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ సత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నున్న శ్రీ నాగలక్ష్మి, ఆలపాటి అచ్యుత లక్ష్మిలు వెల్లడించారు. కామినేని ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిచే ఈసీజీ, ఈసీహెచ్ఓ, షుగర్, తదితర పరీక్షలు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం జరుగుతుందని, పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామంలో కప్పల ఊరేగింపు



వర్షాలు కురవాలని కోరుతూ చిన్నారులు కప్పలను తలపై పెట్టుకొని ఊరేగిస్తున్న దృశ్యం

పెంటపాడు: వేసవి ఎండను తట్టుకోలేక పోతున్నాం, సకాలంలో వర్షాలు కురవాలని యానాపల్లి గ్రామంలో చిన్నారులు వరుణ దేవుణ్ని వేడుకొంటున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కప్పలను పూజించి గ్రామంలో భారీగా ఊరేగించారు. చిన్నారులు ఎదోలా కప్పలను పంట బోదెల్లో పట్టుకొని ధైర్యం చేసి వాటిని తలపై కెత్తుకొని గ్రామంలో ఊరేగింపు ప్రారంభించారు. దీంతో పెద్దలు కూడా కలిసి వారికి సాయం చేస్తూ వాటికి పసుపు, కుంకుమలు వేసి పూజించారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు



అత్తిలి దుకాణాలలో బాలకార్మికులను తనిఖీ చేస్తున్న కార్మికశాఖ అధికారులు

అత్తిలి: బాలలను పనిలో పెట్టుకున్న దుకాణదారులపై కేసులు నమోదు చేసి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కార్మికశాఖ సహాయ అధికారులు బి లక్ష్మణ్‌కుమార్, ఎస్ దుర్గారావు చెప్పారు. బాలకార్మికుల తనిఖీలలో భాగంగా సోమవారం అత్తిలి గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో దుకాణాల్లో పనిచేస్తున్న ఇద్దరు బాల కార్మికులను కనుగొని, వారిని పనిలో పెట్టుకున్న యజమానులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై ఎస్ వెంకట్రావు, హెడ్ కానిస్టేబుల్ ఐ కృష్ణారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి, డీపీ మాణిక్యాంబ, అసిస్టెంట్ సీడీపీఓ ఎం ఆశారోహిణి పాల్గొన్నారు.

పుస్తక పఠనం ద్వారానే విజ్ఞానం



విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం గోపాల కృష్ణ ప్రసాద్

తణుకు టౌన్: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెంపొందించుకోవడంతో పాటు నైపుణ్యాలు పెరుగుతాయని తణుకు వెంకట్రాయపురం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెదపాటి గోపాల కృష్ణ ప్రసాద్ తెలిపారు. జాతీయ పుస్తక పఠన దినోత్సవం సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ అమ్మాజీ విద్యార్థులకు పుస్తక పఠనంపై పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు.

'ఆణిముత్యాలు' విద్యార్థులు



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం హైస్కూల్ విద్యార్థికి మెడల్స్ అందజేస్తున్న దృశ్యం



పదో తరగతి విద్యార్థులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కరరావు, తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించి ఆణిముత్యాల్లా నిలిచారని జగన్నాథపురం గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. సోమవారం మండలంలోని జగన్నాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థికి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మెడల్స్, నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడారు. జగన్నాథపురం వార్డు మెంబర్లు గోపీ, లక్ష్మణరావు, చినపుల్లారావు,పంచాయతీ కార్యదర్శులు కె.శ్రీనివాసరెడ్డి, ఫణి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, తల్లిదండ్రుల కమిటి సభ్యులు పాల్గొన్నారు. అలాగే, ఆరుగొలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఖండవల్లి రామ్‌చరణ్ తేజకి రూ.3వేలు నగదు, బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఆరుగొలను సర్పంచ్ పీతల బుచ్చిబాబు, ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు, విద్యాకమిటి చైర్మన్ ప్రభాకర్, సొసైటీ చైర్మన్ చిక్కాల సత్యనారాయణ, ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు. దండగర్ర జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన ఎం.నీలిమ ప్రశాంతి, కర్రి సౌజన్య, ఎం.నరేషలకు జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లా రాంబాబు, ఎంపీటీసీ వీరమళ్ళ వెంకన్న, ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ అధ్యక్షురాలు పత్సా బేబిరాణి, పాఠశాల తల్లిదండ్రుల కమిటి అధ్యక్షురాలు బొమ్మల శ్రీదేవి, గ్రామ పెద్దలు పెద్దింటి పెరుమాళ్ళాచార్యులు, విద్యాకమిటి సభ్యులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

విద్యారంగం అభివృద్ధికి జగనన్న కృషి అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యారంగం అభివృద్ధికి జగనన్న కృషి అభినందనీయమని మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి భాస్కరరావు కొనియాడారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రైజ్ మనీ, మెడల్స్, సర్టిఫికెట్స్ బహుకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు పాతూరులోని 10, 12 వార్డులకు సంబంధించి ఇంచార్జ్‌లు అడ్డాల నరసింహరావు, చామన సూర్యచంద్రరావులు పర్యవేక్షణలో సంజీవనగర్ ఉన్నత పాఠశాల ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం బ్రహ్మం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కర్రి భాస్కరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో భాగంగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని కొనియాడారు. విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అధిరోహిస్తున్నారని చెప్పారు. పదో తరగతిలో ప్రథమ స్థానం సాధించిన గుత్తికొండ సిరి చందనకి రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన టి.రాఘవేంద్ర నాగ సాయి కుమార్‌కు రూ.2 వేలు, తృతీయ స్థానం సాధించిన ఆరుగుళ్ల ప్రవీణ్ వరవల్లిక్రప్రియకు రూ.1000, నగదుతో పాటు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేశారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ ఆరిమిల్లి రవి, చామన ప్రసాద్, మార్కెట్ యార్డు డైరెక్టర్ కోడే శ్రీనివాస్, పెనుగొండ ఆంజనేయులు, ఆలం కొండ, ఎం.మేరి, తాడిపల్లి శ్యాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికడదాం



పట్టణంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల వ్యాప్తిని అరికట్టి, ప్రజారోగ్యాన్ని కాపాడుదామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలు సందర్భంగా సోమవారం వైద్య ఉద్యోగులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 28, 29 వార్డుల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో భాగంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల నివారణ చర్యల్లో భాగంగా దోమ తెరలు వాడాలన్నారు. ఇంటి కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవడం, ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించడం తప్పనిసరి అన్నారు. నీటి తొట్టెలను ప్రతి వారం రోజుల కొకసారి ఖాళీ చేసి తిరిగి నింపాలన్నారు. డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాల్లో భాగంగా నీటి నిల్వల్లో దోమలు అభివృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీట నిల్వలు ఉండే ప్రదేశాల్లో అబేటు స్ప్రే చేయాలని సూచించారు. వార్డు ఆరోగ్య కార్యదర్శులు జి.బేబి, చంద్రకళ, ఆరోగ్య సహాయకులు కాంతారావు, శ్యామ్, దుర్గ, వలంటీర్లు, ఆశాలు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైకాలజిస్ట్ గంగాధర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): మద్యం, మాదక ద్రవ్యాల అలవాట్లును మాన్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు మళ్లిపూడి మిత్ర అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో దీక్ష మత్తు మందు బానిసల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక 6వ వార్డు సచివాలయం కార్యాలయం వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మిత్ర మాట్లాడుతూ మద్యం మత్తు నుంచి బయటకు వచ్చేందుకు ప్రజల్లో అవగాహన తప్పనిసరి అన్నారు. సొసైటీ చేస్తున్న సేవాలను వెల్లడించారు. సైకాలజిస్ట్ గంగాధర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వ్యసనాన్ని మాన్పించడం అసాధ్యం కాదన్నారు. చికిత్స, కౌన్సిలింగ్ ద్వారా వ్యవసపరులను విముక్తులను చేయవచ్చునని తెలిపారు. సచివాలయం అడ్మిన్ ఎ.మధు, సొసైటీ కౌన్సిలర్ శ్రీనివాస్, అంజలి పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ



6వవార్డులో దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న పట్టణ ఎస్సై జిజె ప్రసాద్

తాడేపల్లిగూడెం అర్బన్ : దిశ యాప్ మహిళలకు రక్షణ వంటిందని ఎస్సై జిజె ప్రసాద్ తెలిపారు. సోమవారం పట్టణంలోని 6వ వార్డులో పీఅండ్‌టి కాలనీలో దిశ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. మహిళలు కచ్చితంగా తమ ఫోన్లలో దిశయాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రమాదాలు ఎదురైన సమయాల్లో దిశ యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే వెంటనే మహిళలకు సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్లకు సమాచారం అంది తక్షణం సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బోశం జయభారతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



కె ఇల్లిందలపర్రులో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న దృశ్యం

ఇరగవరం: విద్యార్థి శ్రేయస్సు ప్రభుత్వ లక్ష్యమని కె ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున అన్నారు. మండలంలోని కె ఇల్లిందలపర్రులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మల్లిరెడ్డి నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేలాది కోట్లు ఖర్చుతో జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, ఆణిముత్యాలు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టి విద్యార్థుల శ్రేయస్సుకు అహర్నిశలూ కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగపరుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, గరికిపాటి సతీష్, తల్లిదండ్రుల కమిటి చైర్మన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



విప్పర్రులో అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేస్తున్న కొట్టు విశాల్

పెంటపాడు: అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. పడమర విప్పర్రు గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై ఒక మతిస్థిమితం లేని యువతి మృతి చెందిన విషయం విధితమే. సర్వం కోల్పోయిన ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ నిధులు మంజూరు చేశారు. తక్షణ సాయంగా సోమవారం సాయంత్రం ఆయన తనయుడు కొట్టు విశాల్ బాధితులను పరామర్శించి రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో విప్పర్రు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25న నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సంఘ సమావేశం

సాక్షి, భీమవరం : భీమవరం ప్రాంతీయ నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘ సమావేశం ఈనెల 25న భీమవరంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం సత్యనారాయణ, సీహెచ్ బంగారురావు, కోశాధికారి పీవీవీ సత్యనారాయణ చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలను సోమవారం భీమవరంలో విలేకర్లకు వివరించారు. ఈ సమావేశంలో భీమవరం ప్రాంతీయ నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ కమిటీ ఏర్పాటు చేస్తామని, అనంతరం ప్రముఖ సాయి సంగీత కీర్తనల ఆధ్యాత్మిక సంగీత విద్వాన్ పిప్పళ్ల ప్రసాద్‌ను సన్మానించనున్నట్లు చెప్పారు. నాయీ బ్రాహ్మణ ఉద్యోగులందరూ సమావేశంలో పాల్గొనాలని కోరారు.

లీకేజీలు అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు



పైపులైన్ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శామ్యూల్

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలోని మంచినీటి సరఫరా పైపులకు ఏర్పడ్డ లీకేజీలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ డా.అనపర్తి శామ్యూల్ తెలిపారు. ఈ చర్యలను పట్టణంలో సోమవారం నుంచి ప్రారంభించారు. స్థానిక 31వవార్డులోని మెయిన్ పైపులైన్లకు లీకేజీలను అరికట్టేందుకు మరమ్మతులు చేపట్టారు. లీకేజీల కారణంగా శివారు ప్రాంతానికి మంచినీరు సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయన్నారు. తాగునీటి సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

సాక్షి, భీమవరం : అంగన్‌వాడీ ఉద్యోగులకు జీతం పెంచుతామన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయడంతోపాటు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాడ్యుటీ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె జాన్సీ డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ డిమాండ్ల సాధన కోసం జూలై 10వ తేదిన 36 గంటలపాటు జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్ల పర్యవేక్షణ కోసం ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతినెలా జీతాలు సక్రమంగా విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎండీ హసీనా, ఉపాధ్యక్షురాలు వైట్ల రాణి, మహాలక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.

1 నుంచి అన్ని గ్రామాల్లో జగనన్న సురక్ష పథకం

పెంటపాడు: ప్రభుత్వం అందించే సేవలు ప్రతి కుటుంబానికి సంపూర్తిగా చేరేలా చేసే కార్యక్రమంలో భాగంగా వచ్చే నెల 1 నుంచి మండలంలో పలు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ జీవీ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీలు తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి టీం సభ్యులు రెండు బృందాలుగా వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించేలా జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారన్నారు. కుల ధ్రువీకరణ, ఆధాయ ధ్రువీకరణ, పుట్టినతేదీ, మరణ ధృవపత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం, మ్యూటేషన్, కుటుంబసభ్యుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌లో మొబైల్‌నెంబరు నమోదు, కౌలురైతు కార్డు, రైస్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఇలా పలు రకాల సేవలు ఈ జగనన్న సురక్ష కార్యక్రమంలో పొందుపరచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని షెడ్యూల్‌ను వివరించారు. జులై 1న ఆకుతీగపాడు, అలంపురం, 4న జట్లపాలెం, అలంపురం-2, 6న కొండేపాడు, మౌంజీపాడు, 11న దర్శిపర్రు, కె. పెంటపాడు, 13న మౌంజీపాడు, కోరిమిల్లి, 15న విప్పర్రు, మీనవిల్లూరు, 18న పరిమెళ్ల, ప్రత్తిపాడు, 20న పెంటపాడు1, రాచర్ల, 22న పెంటపాడు-2, వల్లూరుపల్లి, 25న పెంటపాడు-3, రావిపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం: బాదంపూడినుంచి చేబ్రోలు రైల్వేస్టేషన్‌ల మధ్య ఎవరో గుర్తుతెలియని సుమారు 55సంవత్సరాల వయస్సుగల వ్యక్తిని రైలు బండి ఢీ కొట్టడంతో మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపారు. సోమవారం ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకొందని వెల్లడించారు. మృతుని వివరాలు తెలియరాలేదని, మృతదేహాన్ని గూడెం ఏరియా ఆసుపత్రిలోని మార్చురిలో భద్రపరిచినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతుని వివరాలు తెలిసిన ఎడల ఫొన్ నెంబర్ 9490617090కు ఫొన్ చేయాలని ఎస్సై తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

సాక్షి, భీమవరం : విద్యుత్ అధిక బిల్లులతో సామాన్యులపై పెనుభారం మోపి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యు డు జేఎస్వీ గోపాలన్ పిలుపునిచ్చారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- బోడపాడులో గడపగడపకు మన ప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పెంటపాడు మండలం బోడపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన సాయంత్రం గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి జగనన్న సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామంలో భారీగా స్వాగతం పలికారు. పురాతన ప్రసిద్ధి గాంచిన రామలింగేశ్వరస్వామి వారి ఆలయం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన రామాలయం, ఇందిరమ్మ కాలనీలో ప్రజలతో మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కోసం జగనన్న అందించిన పథకాలు ప్రజలకు వివరించే సమయంలో లబ్ధిదారుల మోములో ఎంతో సంతోషం కనిపిస్తోందన్నారు. ప్రతిపక్షాలైన టీడీపీ, జనసేన పార్టీలు అధికారం కోసం వైఎస్సార్ పార్టీపై అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబుకు బుద్ధిచెప్పినా నేడు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను వెనుక పెట్టి ఎన్నికలకు రావడం విచారమన్నారు. ఈ సారి ప్రజలు టీడీపీని మరింత దిగజార్చి డిపాజిట్లు లేకుండా చేయడం ఖాయమన్నారు. టీడీపీ జెండాలు పట్టుకొని తిరిగేవారు సిగ్గుపడాలన్నారు. 14 ఏళ్ల పాలన సాగించి ఏ అభివృద్ధి చేయక పోగా నేడు మరలా ప్రజలను మభ్యపెట్టేందుకు చంద్రబాబు రావడం సిగ్గుచేటన్నారు. ప్రజలు అభివృద్ధి చేసే వ్యక్తికే పట్టం కడతారన్నారు. ఈ విషయం చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో తప్పక తెలుస్తుందన్నారు. జగనన్నను ప్రజల నుండి ఎవరూ వేరుచేయలేరన్నారు. నేడు గడపగడపకు మన కార్యక్రమంలో భాగంగా అన్ని వర్గాలకు పథకాలు అందడంతో ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు భారీ మెజార్టీ చేకూర్చి గెలిపించాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ బోడపాడు గ్రామ వాసులను కోరారు. పాలకులు అధికారం చేపట్టాక ప్రజల బాగోగులు చూడాలే తప్ప, వారి నమ్మకం వమ్ము కాకండా చూసుకోవాలన్నారు. చంద్రబాబు అధికారంలో ఉండగా జన్మ భూమి పేరుతో దోపిడీకి పాల్పడ్డారు కాబట్టే ప్రజలు నమ్మడం లేదన్నారు. ఈ సందర్భంగా మంత్రిగా పదవి చేపట్టాక తొలిసారిగా తమ గ్రామం విచ్చేసిన ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు సర్పంచ్ గేదల శివకుమార్, పార్టీ సీనియర్ నాయకులు మట్టా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ పుల్లయ్య, విజ్జరోతు పెద్దిరాజు, మీసాల సాయితో పాటు, రామలింగేశ్వరస్వామి దేవాలయ ఈవో చీమలకొండ సాయి తదితరులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ఎంపీపీ దాసరి హైమావతి, వీర్ల గోవింద్, గుండుమోగుల సాంబయ్య, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, పార్టీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపదరావు కృష్ణారావు, మైలవరపు పెదబాబు, సొసైటీల అధ్యక్షులు బూరాడ శ్రీనివాస్, దేవ వెంకటరమణ, ములగాల రామసత్యనారాయణ, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, పరిమెళ్ల గ్రామ సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు పునుకు పుల్లయ్య, చల్లా కుమారస్వామి, మద్రే కృష్ణమూర్తి, పార్టీ యూత్ అధ్యక్షుడు బాస్కరరెడ్డి, జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయ్ ఆనంద్‌రెడ్డి, దాట్ల రామలింగరాజు, కిరణ్‌రాజు, వసంతాడ జోగేంద్ర, డెక్కపాటి వెంకటరమణ, వింజమూరి శ్రీనివాస్, దాసరి ప్రవీణ, ఆయా శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.